క్లుప్తంగా

'వాహన మిత్ర' అర్హుల జాబితా

పెనమలూరు: వైఎస్సార్ వాహన మిత్ర 2023 సంవత్సరానికి సంబంధించి గంగూరు సచివాలయం-1లో లబ్ధిదారుల వివరాలు సచివాలయ అధికారులు సోమవారం ప్రకటించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు, సంక్షేమ అధికారి ప్రేమ్ సుధాకర్‌లు వివరాలు తెలుపుతూ వైఎస్సార్ వాహన మిత్ర పథకం కింద అర్హులు, అనర్హుల జాబితా సామాజిక తనిఖీ కోసం సచివాలయంలో ప్రకటించి నోటీస్ బోర్డులో ఉంచామన్నారు. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ నెలాఖరు కల్లా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో సీఎం సొమ్ము నేరుగా జమ చేస్తారన్నారు.

జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు హెచ్‌ఎంకే విద్యార్థులు



కంకిపాడు: జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు గోసాల హెచ్‌ఎంకే విద్యార్థులు ఎంపికయ్యారు. ప్రతిభ చాటిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ ఆర్.వసంత్‌కుమార్, ప్రిన్సిపల్ సుక్‌మిత్‌కౌర్ సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 20న గన్నవరంలోని బాలుర పాఠశాలలో అండర్ 13, 15 విభాగాల్లో ఫుట్‌బాల్ జట్టు ఎంపిక ప్రక్రియ జరిగిందన్నారు. పాఠశాలకు చెందిన విద్యార్థినులు వై.నిరుపమ, ఎం.అక్షయ, పి.సువేద విశేష ప్రతిభ కనబర్చి జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. త్వరలో జిల్లా జట్టు తరపున అంతర్‌రాష్ట్ర ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. విద్యార్థినులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు రాజును అభినందించారు.

శ్మశానవాటికకు భూమి కేటాయించాలని వినతి

ఉయ్యూరు: ఉయ్యూరులో క్రైస్తవులకు శ్మశానవాటిక భూమి కేటాయించాలని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ కోరారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడుతూ ఉయ్యూరు పట్టణంలో క్రైస్తవులకు సరైన శ్మశానవాటిక లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గురజాడ డొంక రోడ్డులో ఉన్న క్రైస్తవ శ్మశానవాటిక సమాధులతో నిండి పోయిందన్నారు. క్రైస్తవులు ఖననం చేసేందుకు ఖాళీ లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్మశానవాటికకు స్థలాలు కేటాయించాల్సిందిగా ఆదేశాలిచ్చారన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలను అమలు చేసి క్రైస్తవులకు శ్మశానవాటిక స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్ పి.రాజాబాబును మచిలీపట్నంలో కలిసి వినతిపత్రం అందించానన్నారు.

యువత పారిశ్రామికవేత్తలుగా రాణించాలి



రామవరప్పాడు: యువత పారిశ్రామికవేత్తలుగా రాణించి పలువురికి ఉపాధి అవకాశాలు కల్పించాలని రేవన్ కేర్ రెమెడీస్ హెల్త్ కేర్ మేనేజింగ్ డైరెక్టర్ పీవీ రామిరెడ్డి అన్నారు. విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని విజయ ఫార్మసీ కళాశాలలో సోమవారం ప్రపంచ పారిశ్రామిక వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీవీ రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మొదటి నుంచి ఉన్నత ఆశయాలను ఏర్పరచుకోవాలన్నారు. ఉన్నత విద్యతో పాటుగా అంతర్గత నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. చాలా మంది యువత సొంతంగా పరిశ్రమలు స్థాపించి రాణిస్తున్నారని చెప్పారు. అంతేకాక అనేక మందికి ఉపాధి కూడా చూపిస్తున్నారన్నారు. కోచ్ ఆర్గానిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఔషధరంగంలో శాస్త్రీయతను ఇనుమడింజేసి నూతన పద్ధతులను ఆవిష్కరించడం ద్వారా మంచి వ్యాపారవేత్తలుగా అభివృద్ధి చెందవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.పద్మలత బీఫార్మసీ, ఫార్మడీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హతే సిఫారసు



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు మాదాసు జమున. రామవరప్పాడులోని పీఎస్సార్ కాలనీలో నివాసం ఉంటారు. కుటుంబ పోషణ నిమిత్తం టిఫిన్ బండి నిర్వహిస్తున్నారు. ఈమెకు ఇద్దరు ఆడపిల్లలు, భర్త లారీ డ్యూటీకి వెళ్తుంటాడు. భార్య, భర్తలు ఎంత కష్టపడినా కుటుంబ పోషణకే కష్టమవుతోంది. ఈ తరుణంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బిడ్డల చదువు నిమిత్తం అమ్మఒడి మంజూరైంది. చిరు వ్యాపారులకు ఇచ్చే జగనన్న తోడు ద్వారా తోడ్పాటు అందింది. ఇళ్ల స్థలం మంజూరవ్వడంతో పాటు వైఎస్సార్ ఆసరా కూడా రావడంతో ఆ కుంటుంబం సంతోషంగా జీవిస్తోంది.



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు చెన్ను బాబూరావు. ప్రసాదంపాడులో నివాసం ఉంటారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ కోసం ఎన్ని సార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వలంటీర్ల ద్వారా పింఛను ధరఖాస్తు చేసుకున్న వెంటనే మంజూరైంది. దీంతో నెల నెలా అవసరమైన మందులు, ఇంటి ఖర్చులకు ఇబ్బందులు తొలగాయి. బాబూరావు భార్య రమణమ్మకు వైఎస్సార్ ఆసరా మూడేళ్లుగా వస్తోంది. అలాగే ఇంటి స్థలం మంజూరైందని, మనవళ్లకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తోందని బాబూరావు సంతోషంగా చెబుతున్నారు.

గ్రామ సచివాలయాలతో మారిన పాలన తీరు

- ప్రజల చెంతకే చేరుతున్న ప్రభుత్వ పథకాలు
- వలంటీర్లతో పండుటాకులకు ఇళ్ల వద్దే పింఛన్లు
- సిబ్బందిలో పెరిగిన జవాబుదారీతనం
- హర్షం వ్యక్తం చేస్తున్న పల్లె ప్రజానీకం



ప్రసాదంపాడులో సచివాలయం

విజయవాడ రూరల్‌లో పరిస్థితి:	
సచివాలయాల సంఖ్య:	32
వివిధ సంక్షేమ పథకాల్లో లబ్ధిపొందిన వారి సంఖ్య:	1,48,995
లబ్ధిదారులకు అందించిన మొత్తం:	రూ. 456.46 కోట్లు
వివిధ రకాల పింఛన్లు పొందుతున్న వారి సంఖ్య:	17,026

రామవరప్పాడు: గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు, పథకాలు పొందాలంటే ప్రభుత్వ కార్యాలయాలు, మండల కేంద్రాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. దీనికి తోడు స్థానిక నాయకుల సిఫారసులతోనే పనులు జరిగేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఈ విధానాలకు చెక్ పెడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాల ఏర్పాటుతో సరికొత్త పాలన ఆవిష్కృతమైంది. దేశంలో ఎక్కడా లేని విధంగా అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు ఇంటి ముంగిటకే చేరుతున్నాయి. ప్రతి 2వేల జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేయడంతో పాలన చేరువైంది. ప్రజలకు ఏ అవసరం వచ్చిన వారి గ్రామాల్లోనే సేవలు పొందుతున్నారు.

చేరువైన సంక్షేమం..

సచివాలయాల ఏర్పాటుతో ఇంటి వద్దకే పాలన అన్న సీఎం జగన్ సంకల్పాన్ని నిజం చేసి చూపారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా నేరుగా సచివాలయాలకు వచ్చి సేవలను పొందుతున్నారు. రాలేని వారు వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను, పలు సేవలను పైసా ఖర్చు, సిఫారసులతో పని లేకుండా సంతోషంగా పొందుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చిన్న సర్టిఫికెట్ కావాలన్న కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని ప్రస్తుతం అర్హులైన ప్రతి ఒక్కరూ పథకాలు పొందే వీలుగా సచివాలయాలు ఏర్పాటు చేశారని ప్రజలు సంతోషంగా చెబుతున్నారు.

సచివాలయాల్లో అందుతున్న సేవలు..

సచివాలయంలో ప్రభుత్వానికి సంబంధించిన వందల రకాల సేవలు ప్రజలకు చేరువ అయ్యాయి. ముఖ్యంగా పింఛన్ పంపిణీ, పేదలందరికీ ఇల్లు, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, భూముల రీసర్వే, వైఎస్సార్ రైతు భరోసా, పశువుల నష్టపరిహారం పథకం, వ్యవసాయ యాంత్రీకరణ, మత్స్యకార భరోసా పథకం, అమ్మఒడి, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు వంటి తదితర పథకాలు వలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్నారు. ఒక్కో ఇంట్లో మూడు నాలుగు పథకాలు నేరుగా అందుతున్నాయి. దీంతో ఆయా కుటుంబాల్లోని వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా జాతీయ వృద్ధుల దినోత్సవం



ఉయ్యూరు బస్టాండ్‌లో సీనియర్ సిటిజన్స్‌ను సత్కరిస్తున్న లయన్స్ ప్రతినిధులు

ఉయ్యూరు: సీనియర్ సిటిజెన్స్ జీవిత అనుభవ పాఠాలు యువత స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రసాద్ అన్నారు. స్థానిక బస్టాండు కూడలి, రైతుబజారు ప్రాంతాల్లో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాలకు చెందిన వృద్ధులను గుర్తించి సత్కరించారు. డీఎం ప్రసాద్ మాట్లాడుతూ వృద్ధులను ప్రేమగా ఆదరించటం సామాజిక బాధ్యత అన్నారు. పెద్దల ఆలోచనలను పరిగణనలోకి తీసుకుని ముందుకు సాగితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. కార్యక్రమంలో లయన్స్ డిస్ట్రిక్ట్ కేబినెట్ ట్రెజరర్ నూకల వెంకట సాంబశివరావు, క్లబ్ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, ప్రతినిధులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధులు రికవరీ చేయండి



మచిలీపట్నంలో కలెక్టర్ రాజాబాబుకు అర్జీ సర్పంచ్ లింగాల భాస్కరరావు

పెనమలూరు: పెనమలూరు గ్రామ పంచాయతీలో దుర్వినియోగం జరిగిన నిధులు వెంటనే రికవరీ చేయాలని కోరుతూ పెనమలూరు గ్రామ సర్పంచ్ లింగాల భాస్కరరావు కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబుకు ఫిర్యాదు చేశారు. మచిలీపట్నంలో సోమవారం జరిగిన స్పందనలో అర్జీని కలెక్టర్‌కు అందజేశారు. పెనమలూరు గ్రామ పంచాయతీలో రూ. 92.67 లక్షలను కార్యదర్శులు, గుమస్తా, బిల్లు కలెక్టర్ స్వాహా చేశారని ఆరోపించారు. అధికారుల విచారణలో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయన్నారు. బిల్లు కలెక్టర్‌ను సస్పెన్షన్ చేసి ఆరు నెలలు గడిచినా ఇప్పటివరకు నయాపైసా వసూలు చేయలేదన్నారు.

ఎస్పీకి కూడా ఫిర్యాదు..

పెనమలూరు పంచాయతీలో నిధులు స్వాహా చేసిన బిల్లు కలెక్టర్ షేక్.షంషుద్దీన్ పై పోలీసులు కేసు నమోదు చేసినా, ఇప్పటివరకు అతనిని అరెస్టు చేయలేదని సర్పంచ్ లింగాల భాస్కరరావు జిల్లా ఎస్పీ పి.జాషువాకు ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకారం



ఎమ్మెల్యేను కలిసిన ఎంఈఓ

గన్నవరం: మండల విద్యాశాఖాధికారి రామ్‌బాల్ సింగ్ సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. బాపులపాడు మండల విద్యాశాఖాధికారిగా పనిచేసున్న ఆయన ఇటీవల గన్నవరం ఎంఈఓ-1గా అదనపు బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కలిసి గన్నవరం, బాపులపాడు మండలాల్లో విద్యాశాఖ పనితీరు, పురోగతిని వివరించారు. నాడు-నేడు మన బడి ద్వారా పాఠశాలల అభివృద్ధి, జగనన్న విద్యాకానుక, అమ్మఒడి పథకాలు అమలు తీరును నివేదించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయల కల్పనకు ఎల్లప్పుడు తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే వంశీమోహన్ స్పష్టం చేశారు.

ఆలయ భూమి లీజుకు వేలం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని శ్రీ సీతారామస్వామి దేవస్థానానికి చెందిన భూమికి సోమవారం నగరంలోని సహాయ కమిషనర్ కార్యాలయంలో దేవదాయశాఖాధికారుల సమక్షంలో వేలంపాట నిర్వహించారు. గ్రామంలోని ఆర్‌ఎస్ నంబర్ 186లోని దక్షిణం వైపు గల 5బిట్లను 11 సంవత్సరాలు లీజుకు ఇచ్చేందుకు ఈ బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయల కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి మాట్లాడుతూ ఈ వేలం పాటలో మొదటి బిట్ (40 సెంట్లు)కు నెలకు రూ .11వేలు, 2వ బిట్‌కు (39 సెంట్లు) నెలకు రూ. 10,500, 3వ బిట్ (40 సెంట్లు) నెలకు రూ. 10,500, 4వ బిట్ (40 సెంట్లు)కు నెలకు రూ. 11వేలు, 5వ బిట్ (29 సెంట్లు) నెలకు రూ. 8,500 చెల్లించే విధంగా శ్రీ విజన్ ఎడ్యుకేషన్ సొసైటీ వారు హెచ్చుపాట పాడుకున్నారన్నారు. మొత్తం నెలకు రూ.రూ 51,500 చొప్పు సంవత్సరానికి 1.88 సెంట్లకు గానూ రూ 6.18 లక్షలు ఆదాయం ఆలయానికి వస్తుందని తెలిపారు.

వేలంపాటపై కోర్టును ఆశ్రయిస్తాం..

సుమారు 6నెలల క్రితం గ్రామానికి చెందిన వ్యక్తి దేవస్థానం భూమి లీజుకు తీసుకునే విషయంలో రూ. 52వేలకు సీల్డ్ టెండర్ అధికారుల సమక్షంలో వేసినా.. దానిని తిరస్కరించి ప్రస్తుతం రూ 51,500లకే పాట కట్టబెట్టిన అంశంపై గ్రామస్తుల తరపున కోర్టును ఆశ్రయించనున్నట్లు గ్రామ సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: కానూరులో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని డీఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన సోమవారం వివరాలు తెలుపుతూ కానూరు సబ్‌స్టేషన్ పరిధిలో నాగార్జున ఫీడర్, టీచర్స్‌కాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. దీని కారణంగా అమరావతికాలనీ, కామయ్యతోపు, ఉమాశంకర్‌నగర్, చలసానినగర్, బందరు రోడ్డు ప్రాంతం, టాప్‌స్టార్ ఆస్పత్రి ప్రాంతం, విజయలక్ష్మి సినిమాహాల్ ప్రాంతం, టీచర్స్‌కాలనీ, 80 అడుగుల రోడ్డు ప్రాంతం, పంటకాలువ రోడ్డు, ధనేకుల కల్యాణమండపం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు తమ సిబ్బందితో సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



కానూరులో ప్రచారం చేస్తున్న ఎస్టీయూ నేతలు

పెనమలూరు: ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి పీకా ఇమ్మాన్యుయేల్ అన్నారు. ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా సోమవారం కానూరు, తాడిగడప, పెదపులిపాక గ్రామాల్లో క్యాంపెయినింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. ఉద్యోగులకు డీఏలు సకాలంలో చెల్లించాలని, సీపీఎస్ విధానం రద్దు చేయాలని, జీవో 117ను రద్దు చేయాలని, వివిధ కారణలతో బదిలీ అయిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ సంఘ నేతలు పీవీ కృష్ణమోహన్, అబ్దుల్ ఖలీల్, మీర్జాహసన్, డానియేల్, జోసఫ్‌కుమార్, స్వరూపారాజు పాల్గొన్నారు.

ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి



సిమెంటు రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ రామదాసు, స్థానిక ప్రజాప్రతినిధులు

కంకిపాడు: ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని మద్దూరు సర్పంచ్ చిప్పల రామదాసు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధులు రూ. 5 లక్షలు, పంచాయతీ సాధారణ నిధులు రూ. లక్షతో గ్రామంలో సిమెంటు రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. పనులను సర్పంచ్ రామదాసు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పార్థసారథి చొరవతో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు గ్రామానికి మంజూరయ్యాయన్నారు. ప్రణాళికాబద్ధంగా గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. నిధులు సమర్థంగా వినియోగించి, అభివృద్ధి వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీటీసీ సభ్యుడు వడుగు శ్రీనివాసరావు, వార్డు సభ్యుడు రావి సాంబశివరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సంధ్య పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూల్లో ఆకస్మిక తనిఖీ



గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను సోమవారం గుడివాడ ఉప విద్యాశాఖాధికారి ఐ. వెంకటపద్మరాణి ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను, విద్యార్థుల హాజరును, ప్రోగ్రెస్ రిపోర్ట్‌లను, మధ్యాహ్న భోజనం పథకం అమలు తీరును పరిశీలించారు. అనంతరం పలు తరగతి గదులను సందర్శించిన ఆమె విద్యార్థులతో ముచ్చటించారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు సన్నద్ధంపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ ఏడాది పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెంచేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లాలని సూచించారు. ఎంఈఓ-2 ఆర్. కమల, హెచ్‌ఎం నిమ్మగడ్డ రవీంద్రభవాని, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు



కంకిపాడు: ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని ఉప్పలూరు సర్పంచ్ లాం సోనియా అన్నారు. గ్రామ పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామంలో దోమల నివారణకు ఫాగింగ్ పనులను సోమవారం ప్రారంభించారు. పంచాయతీ కార్యాలయం వద్ద సాగుతున్న ఫాగింగ్‌ను సర్పంచ్ సోనియా పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు విజృంభించేందుకు దోమలు ప్రధాన కారణమన్నారు. దోమల నివారణకు ఫాగింగ్, డ్రెయినేజీల పూడికతీత పనులను నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు ఇళ్లు, ఇంటి పరిసరాల్లో పరిశుభ్ర వాతావరణం ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రజారోగ్యానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు లాం పార్వతి, వైఎస్సార్‌సీపీ నాయకులు లాం సురేష్, నిమ్మకూరు రామారావు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

యువత ఓటు హక్కు నమోదు చేసుకోవాలి



ప్రసంగిస్తున్న తహసీల్దార్ వెంకటశివయ్య

పెనమలూరు: యువత తమ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని పెనమలూరు తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య అన్నారు. ఆయన సోమవారం కానూరులో వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ, పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024, జనవరి 5వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కు నమోదు చేసుకోవటానికి దరఖాస్తు చేయాలన్నారు. ఫారం -6లో పూర్తి వివరాలు నమోదు చేసి పూర్తి చేస్తే దానిపై విచారణ చేసి ఓటు హక్కు కల్పిస్తామన్నారు. ఓటు హక్కు నమోదు చేసుకోవటానికి డిజిటల్ ఫ్లాట్ ఫారం కూడా అందుబాటులో ఉందన్నారు. మొబైల్ యాప్, వెబ్‌సైట్స్ ద్వారా ఓటు హక్కుపొందే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, డీన్ బావినేని పాండురంగారావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వే సంతృప్తికరం

విజయవాడరూరల్: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నెల రోజుల పాటు జరిగిన ఇంటింటా సమగ్ర ఓటర్ల సర్వే కార్యక్రమం సంతృప్తికరంగా జరిగిందని గన్నవరం నియోజకవర్గం ఎన్నికల నమోదు అధికారి బి. చంద్రలీల పేర్కొన్నారు. సోమవారం విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని బూత్ స్థాయి అధికారుల సమావేశం జరిగింది. ఈఆర్వో చంద్రలీల మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులు సర్వే నివేదికను ఈ రోజే అందజేయాలన్నారు. రూరల్ తహసీల్దార్ పి.జాహ్నవిరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ బీఎల్‌వీ శేషగిరిరావు పాల్గొన్నారు.

సర్వే రాళ్లు సిద్ధం

విజయవాడరూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న భూ రక్ష పథకం కింద జరిగే రీసర్వే కార్యక్రమం విజయవాడ రూరల్ మండలంలో ముమ్మరంగా సాగుతోంది. మండలంలో మొదటి ఫేజ్‌లో రీ సర్వేకు 9 గ్రామాలను ఎంపిక చేయగా వాటిలో వేమవరం, షాబాదు, పైడూరుపాడు, అంబాపురం గ్రామాల్లో రీసర్వే కార్యక్రమం పూర్తయినట్టు మండల సర్వేయర్ రమేష్ తెలిపారు. ప్రస్తుతం రాయనపాడు, కొత్తూరు, తాడేపల్లి, జక్కంపూడి పి.నైనవరం గ్రామాల్లో రీసర్వే కార్యక్రమం జరుగుతుందన్నారు. మండలంలోని గ్రామ సర్వేయర్లతో పాటు గంపలగూడెం, కంచికచర్ల, తిరువూరు, జి. కొండూరు మండలాల్లోని సర్వేయర్ల సహకారంతో వేగవంతంగా రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు ఎల్‌సీ నంబర్లను ఇచ్చామన్నారు. 6 గ్రామాల్లోని 12వేల 113 ఎకరాల48 సెంట్లకు సంబంధించిన భూములకు గాను 3వేల869 జగనన్న భూరక్ష సర్వేరాళ్లను సర్వేశాఖ పంపిందన్నారు.

స్వయం ఉపాధితో మహిళల ఆర్థిక స్వావలంబన

గన్నవరం ఎమ్మెల్యే వంశీమోహన్



మహిళలకు రుణాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వంశీమోహన్

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్వయం ఉపాధి కల్పన ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చెప్పారు. బాపులపాడు మండలం తిప్పనగుంటలో జగనన్న పాలవెల్లువ లబ్ధిదారులకు పీఏసీఎస్ రూ.2.40 లక్షల రుణాలను సోమవారం ఆయన పంపిణీ చేశారు. పాడి పశువులను కొనుగోలు చేసేందుకు ఒక్కొక్కరికీ రూ.30 వేలు చొప్పున 8 మంది మహిళలకు రుణాలు అందజేశారు. ప్రతి పేద మహిళ ఆర్థిక పరిపుష్టి సాధించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే వంశీ వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ చేయూత, డ్వాక్రా రుణాలు, సున్న వడ్డీ పథకం, జగనన్న పాల వెల్లువ వంటివి పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు వ్యవసాయంతో పాడి పరిశ్రమ ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. పీఏసీఎస్ ఛైర్మన్ మూల్పూరు ప్రభుకాంత్, సర్పంచ్ కలపాల భీమయ్య, ఎంపీటీసీ సభ్యురాలు కొవ్వలి పద్మ, పీఏసీఎస్ సీఈవో లోకేశ్వరరావు పాల్గొన్నారు.